కథ

# "ఊసరవిల్లి"

రావి-ఎన్-అవధాని

"మమ్మీ! ఇదుగో నా బెస్ట్ ఫ్రెండ్ సూరజ్! మాక్లాసులో అన్ని సబ్జెక్టుల్లోనూ ఫస్ట్!" అంటూ తల్లికి పరిచయం చేశాడు నీరజ్.

"వెరీగుడ్! నువ్వూ వీడిలా బాగా చదువుకొని ఫస్ట్‌ర్యాంక్ సాధించాలి! ఇలారా బాబూ!" అని సూరజ్‌ని సోఫాలో తనప్రక్కన కూర్చోపెట్టుకుంది పంకజవల్లి.

నీరజ్ తన క్లాస్ టీచరు హేమను, మరో ఇద్దరు టీచర్లనూ, తోటి విద్యార్థులను తల్లికి పరిచయం చేశాడు. వారందరినీ కూర్చోమంది.

"మేడమ్! సూరజ్ చదువులోనేకాదు మంచి సింగర్! క్లాసికల్ మ్యూజిక్- త్యాగరాజ కృతులు, అన్నమాచార్య కీర్తనలు చక్కగా పాడుతాడు! ఎన్నో బహుమతులు అందుకున్నాడు!" అంది టీచరు హేమ.

"అలాగా! అయితే ఈరోజు నువ్వు మాకు నీ పాట వినిపించాలి. బాగుంటే నీ గాత్రకచేరీ మా క్లబ్బులో పెట్టిస్తాను!'' అంది పంకజవల్లి.

సూరజ్ 'సరే'నన్నాడు.

" మా నీరజ్‌కి చదువు చెప్పడానికి, హోమ్‌వర్క్ చేయించడానికి ట్యూషన్ టీచర్ని పెట్టాను. అయితే ఆ టీచరు మావాడిని సరిగా చదివించలేనట్లుంది. వాడికి ఎన్నడూ ఫస్ట్‌ర్యాంకు రాలేదు. ఎప్పుడూ అత్తెసరు మార్కులే! చూడ్డానికి నాకసలు వీలుండదు!"

''నీ ట్యూషన్ ఎవరివద్దా చదవడంలేదండీ! నేనే చదువుకుంటాను. తెలియని విషయాలు మా డాడీ చెప్తారు'' అన్నాడు.

"ఏమిటీ! ట్యూషన్ ఎవరు? ఏం చేస్తుంటారు? స్కూల్ టీచరా?" అంది పంకజవల్లి వ్యంగ్యంగా నవ్వుతూ.

''కాదండీ! మాడాడీ... ''ఏవో చెప్పబోయాడు. "వాడి డాడీ ఆటోడ్రైవరు రాంజీ! మీకు తెలియదా మేడమ్!" అంది మహిళా మండలి కార్యదర్శి నీలవేణి.

"ఏమిటీ?! నువ్వు ఆటోడ్రైవరు కొడుకువా! లేరా! లే! ముందు సోఫాలోంచి లేచి బయటకు పోరా!" అంది కోపంతో.

సూరజ్ భయంతో కంపించిపోతూ సోఫాలోంచి లేచి నిల్చున్నాడు.

"అదికాదు మమ్మీ..." అని నీరజ్ ఏమో చెప్ప బోయాడు.

"షటప్! ఇలాంటి వారితో నీవుస్నేహం చేసి తిరగడంవల్లనే నీ చదువు అలా తగలబడుతోంది" అంటూ కొడుకుని కసిరింది.

నలుగురి ముందూ తల్లి కసరడంతో వాడు అలిగి లోనికి ఏడుస్తూ వెళ్ళిపోయాడు.

"చూడండి మేడమ్!..." అని హేమ ఏమో చెప్పబోయింది. స్కూల్లో చేర్చుకున్న మీ ప్రిన్స్‌పాల్ని అనాలి. హంగులూ, ఆర్భాటాలూ చూసి మోసపోయి అనవసరంగా మా నీరజ్‌ని మీ కాన్వెంట్‌స్కూల్లో చేర్పించాను బయటకు పొమ్మంటే నీక్కాదురా? ఇంకా నిల్చున్నావేం? పోరా" అని సూరజ్ వీపుమీద చెయ్యివేసి ముందుకునెట్టింది.

వాడు తూలి ఎదురుగా ఉన్న టీపాయ్‌మీద పడ్డాడు. వాడి నుదుటికి దెబ్బ తగిలి రక్తం కారుతోంది.

టీచరు హేమ వాడిని లేవదీసి దెబ్బ తగిలినచోట రక్తం ఆపడానికి చేతి రుమాలుతో రక్తంకారుతున్న చోట అదిమి పట్టుకొని వాడిని బయటకు తీసుకొని వెళ్తూ "కమాన్ స్టూడెంట్స్ లెట్‌అజ్ గో" అంది

అందరూ ఆమె వెంటవెళ్ళిపోయారు.

మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పంకజవల్లికి ఆస్తీ అంతస్తూ, పెద్ద చదువులేకున్నా ఆమె అందచందాలను చూసి వివాహం చేసుకున్నాడు ప్రముఖ వ్యాపారవేత్త ఆనందరావు.

అత్తవారింట కలలోకూడ ఊహించని సిరిసంపదలు కళ్లపడేసరికి పంకజవల్లి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది. ఆమెకు ఎక్కడలేని గర్వం వచ్చింది.

అత్తమామల అదుపులేకపోవడంతో ఆమె "ఆడిందే ఆట పాడిందే పాట"యింది. ముందుగా భర్తను తన చెప్పు చేతల్లో ఉండేవిధంగా చేసుకొంది. పుట్టింటివారిని, బంధువులను దూరంగా ఉంచింది.

సంఘంలో తనకు గౌరవం, పరపతి, హోదా పెంచుకోవడం ముఖ్యం అనుకుంది. ఊర్లో ఉన్న మహిళామండలిని అభివృద్ధిపర్చింది. ప్రభుత్వ ఉన్నతోద్యోగుల భార్యలను, బడా వ్యాపారవేత్తల భార్యలను కలిసి వారందరినీ మహిళా మండలిలో చేర్పించింది.

తరచు వినోద కార్యక్రమాలు, పార్టీలు, డిన్నర్లూ ఏర్పాటు చేస్తూ తన ప్రత్యేకతను చాటుకుంది.

అయితే తనకు లాభంలేని ఏ పని పంకజవల్లి చేయదు. ఆనందరావు భార్య చేస్తున్న ఏ పనినీ ఎన్నడూ కాదనలేదు. ఆమెకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాడు. అతనికి దేశంలో అన్ని ప్రధాన నగరాల్లోనూ బ్రాంచి ఆఫీసులున్నాయి. వ్యాపార లావాదేవీల కొరకు వారంలో నాలుగురోజులు క్యాంపులో ఉంటాడు. అతను ఊర్లో లేని సమయంలో పంకజవల్లి అతని వ్యాపారాలు చూస్తోంది. ఆ విధంగా కూడ ఆమెకు ఎందరితోనో పరిచయం ఏర్పడింది. ఆమె పరపతి, గౌరవం, హోదా పెరిగింది.

ఆనందరావు - పంకజవల్లిల ఏకైక కుమారుడు "నీరజ్" వయస్సు పది సంవత్సరాలు. గీతా కాన్వెంట్ స్కూలు ఊర్లో అన్ని కాన్వెంట్‌స్కూల్స్ కన్నా మంచిది అని తెల్సుకొని అందులో తనకొడుక్కి 5వ తరగతిలో సీటు సంపాదించింది. ఇప్పటివరకూ ఏడాదికొక స్కూలు, ట్యూషన్ టీచర్ని మార్చుతోంది.

ఆ సంవత్సరం నీరజ్ బర్త్‌డే ఘనంగా

జరపాలనుకుంది. మహిళామండలి సభ్యులకు డిన్నరు ఏర్పాటుచేసింది. నీరజ్ క్లాసు పిల్లలను ఇంటికి తీసుకొని రమ్మంది. గీతాకాన్వెంట్ ప్రిన్సిపాల్ అందుకు అంగీకరించలేదు.

"తాము స్కూలు పిల్లల్ని ఎవరింటికీ పార్టీలకు తీసుకొని వెళ్లమని అది రూల్స్‌కి వ్యతిరేకమని" చెప్పింది.

అయితే నీరజ్ క్లాసుటీచరు హేమ ప్రిన్స్‌పాల్‌ని కలిసి పిల్లల్ని తన బాధ్యతమీద తీసుకొని వెళ్లి వాళ్లను ఇంటివద్ద అప్పగిస్తానని చెప్పి ఒప్పించింది. మరో ఇద్దరు టీచర్లను కూడ సహాయంగా తనవెంట తీసుకొచ్చింది.

స్కూలు బస్సులో వారు పంకజవల్లి ఇంటికి వచ్చారు. ఆవరకే మహిళామండలి సభ్యులంతా వచ్చి బయట లాన్‌లో షామియానా క్రింద కూర్చున్నారు.

నీరజ్ తన టీచర్లనూ స్టూడెంట్స్‌నూ డ్రాయింగ్‌రూంలో ఉన్న తల్లి వద్దకు తీసుకొని వెళ్లాడు.

ఈ అనుకోని సంఘటనకు టీచరు హేమ హడలిపోయింది. సూరజ్‌ను దగ్గరలో ఉన్న నర్సింగ్‌హోంకు తీసుకొని వెళ్లి జాయిన్ చేసింది. మిగిలిన పిల్లలను వారి ఇంటివద్దకు తీసుకొని వెళ్లమని తనతోటి టీచర్లకు చెప్పి పంపించింది. సూరజ్ ఇంటికి ఫోను చేసి విషయం చెప్పింది.

సూరజ్ తండ్రి రాంజీ అసలు పేరు జయరాం. బి.ఏ ఫస్ట్‌ర్యాంక్ సాధించాడు. పై చదువుకు స్తోమతలేక ఉద్యోగప్రయత్నం చేశాడు. తరువాత అంచలంచలుగా మరో ఆరు ఆటోలు కొన్నాడు.

జయరాం మంచితనం, తెలివితేటలు చూసి ఆటో ఓనర్లు, ఆటోడ్రైవర్ల అసోసియేషన్స్ వారు అతడిని తమ యూనియన్స్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అటు ట్రాన్సుపోర్టు అధికారులతోనూ, ఇటు పోలీసు అధికారులతోను మంచి సంబంధాలు ఏర్పరచుకొని, ఏ సమస్యనైనా నేర్పుగా పరిష్కరిస్తూ మంచి పలుకుబడి, గౌరవం సంపాదించాడు.

జయరాం భార్య సునీత. భర్తకు అన్ని విధాలా అనుకూలవతి. మ్యూజిక్ డిప్లమా చేసింది. ఇంటివద్ద పిల్లలకు సంగీతం నేర్పుతోంది. వారి ఏకైక కుమారుడు సూరజ్. వయస్సు తొమ్మిది సంవత్సరాలు. చురుకైనవాడు. తెలివైనవాడు. తల్లివద్ద సంగీతం నేర్చుకుంటున్నాడు గీతా కాన్వెంట్‌లో 5వ క్లాసు చదువుతున్నాడు.

టీచరు హేమ ఫోను చెయ్యగానే సునీత భర్తకు కబురు పంపి నర్సింగ్‌హోమ్‌కి వెళ్లింది.

విషయం తెలుసుకున్న యూనియన్ మెంబర్లు వెంటనే టీచరు హేమ వద్ద వివరాలు సేకరించి పోలీసు కంప్లైంటు ఇచ్చి కేసు పెట్టారు రెండు వందలమంది పంకజవల్లి ఇంటిముందు చేరి గొడవ ప్రారంభించారు.

పంకజవల్లి పోలీసులకు ఫోన్‌చేసి తన ఇంటిముందు గొడవ జరుగుతున్న విషయం చెప్పింది. తన లాయరు రంగనాథంని పిలిపించింది.

జయరాం విషయం తెల్సుకొని వెంటనే నర్సింగ్‌హోమ్‌కి వెళ్లి డాక్టర్ని కలిసి మాట్లాడి కొడుకు కండిషన్ తెలుసుకున్నాడు. గాయం కాస్త బలంగానే తగిలిందని మూడు కుట్లు పడ్డాయని డాక్టరు చెప్పాడు.

తనవల్లే యీ ఘోరం జరిగిందని ఆవేదన చెందుతున్న టీచరు హేమను ఓదార్చి ఇంటికి పంపించాడు.

యూనియన్‌వారు పోలీసు రిపోర్టు ఇవ్వడమే కాకుండా పంకజవల్లి ఇంటిముందు చేరి గొడవచేస్తున్న విషయం తెల్సుకొని అక్కడికి వెళ్లాడు. సమస్య పరిష్కరిస్తాను అని వారిని ముందు శాంతపర్చాడు. పంకజవల్లి లాయరు రంగనాథంతోనూ పోలీసు అధికారులతోనూ మాట్లాడేడు. పంకజవల్లి వచ్చి క్షమాపణ చెప్తే కంప్లైంటు వెనక్కి తీసుకుంటామని చెప్పారు యూనియన్ నేతలు.

పంకజవల్లి అంగీకరించలేదు."అలా చేస్తే తన గౌరవ మర్యాదలకు భంగం" అంది.

ఆమె మొండిపట్టు విడవకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, లాయరు రంగనాథంగారు పోలీసు అధికారులు నచ్చ చెప్పడంతో చివరకు అంగీకరించింది.

లాయరు రంగనాథంగారు పంకజవల్లిని తీసుకొని బయటకు వచ్చారు.

యూనియన్ మెంబర్లతో మాట్లాడుతున్న వ్యక్తిని పంకజవల్లి చూపించి "మేడమ్! ఈయనే రాంజీగారు"! అని పరిచయం చెయ్యబోయాడు రంగనాథంగారు పరిచయం చేయబోయిన వ్యక్తిని చూసి పంకజవల్లి షాక్ అయింది.

"తమ్ముడూ జయరాం! నువ్వేంటిరా ఇక్కడ! రాంజీవి నువ్వా! అంటే సూరజ్..."

"నీ మేనల్లుడు అక్కా" అన్న జయరాం మాటలకు నిర్ఘాంతపోయింది పంకజవల్లి.

# బతుకు భయం

## బద్దినాగేశ్వరరావు

ఇంటి నిట్రాటను
నేనే అనుకున్నాను
ముందు తరాలకు
పాతరగా మురిసేను
అహరహమూ చీమనై
ఇంటిపుట్టకోసం
నూకల మూపునయ్యేను
పూల తావులనుంచి
మకరందం సంపదని
పరుగుల ఉరుకులతో
సేకరించే మధుపమునయ్యాను
జీవిత కాలమంతా
అశ్రద్ధ చేసినందుకేమో
తమ సేవలని గుర్తించని
కృతఘ్నుడిగా తలచాయేమో
వయసు మీరిన నాపై
అంగాలన్నీ
సహాయనిరాకరణ
ఉద్యమాలైనాయి
కళ్ళూ కాళ్ళూ కీళ్ళూ
పనులు మానేసి
పగబట్టేయి
ఓ పక్క సంతునన్ను
విడిచిన చెప్పులుగా చేస్తే
ఇంద్రియాలు
శత్రువుగా చూస్తున్నాయి
ఇప్పుడు బతుకు
భయం భయంగానే
దినదినగండంగానే